క్లుప్తంగా

ఉచిత కంప్యూటర్ శిక్షణ ప్రారంభం

చైతన్యపురి: గడ్డిఅన్నారం డివిజన్ కోదండరాం నగర్ కాలనీలోని అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... వివిధ కంప్యూటర్ కోర్సులలో ఇచ్చే ఉచిత శిక్షణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉచితంగా కంప్యూటర్ శిక్షణ ఇస్తున్న అమ్మ ఫౌండేషన్ చైర్మన్ నాగమల్ల అనిల్‌కుమార్‌ను కార్పొరేటర్ అభినందించారు. నాయకులు శ్రవణ్‌గౌడ్, సాయి తేజేశ్వర్‌రెడ్డి, గిరీష్‌గౌడ్, శివ, టింకు, శశాంక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావసరాలకు అనుగుణంగా వసతులు



మహిళలతో మాట్లాడుతున్న కార్పొరేటర్ సుజాతానాయక్

హస్తినాపురం: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ అన్నారు. మల్లికార్జున్‌నగర్‌కాలనీలో కాలనీవాసులతో కలిసి కార్పొరేటర్ మార్నింగ్ వాక్ నిర్వహించారు. అనంతరం సుజాతానాయక్ మాట్లాడుతూ... డివిజన్ పరిధిలో రోజురోజుకు పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా వసతులు కల్పిస్తామన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు లక్ష్మీపతిగౌడ్, మర్యాద రోహిత్‌రెడ్డి, శశి, మంచిరెడ్డి కరుణాకర్‌రెడ్డి, వెంకటేశ్‌గౌడ్, సునీల్, శేఖర్‌యాదవ్, లక్ష్మణరావు, కవిత, బుజ్జినాయక్, అలివేలు పాల్గొన్నారు.

'కంటివెలుగు'కు విశేష స్పందన

మన్సూరాబాద్: కంటివెలుగు కేంద్రానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని మన్సూరాబాద్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు డాక్టర్ పులేందర్‌నాయుడు తెలిపారు. భవానీనగర్‌కాలనీలోని కంటి వెలుగు కేంద్రాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కంటివెలుగు కేంద్రానికి నిత్యం 200 మందికి పైగా హాజరవుతున్నారన్నారు. అందరికీ కంప్యూటర్ సాయంతో కంటి పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. రీడింగ్ గ్లాసెస్‌ను వెంటనే అందజేస్తున్నామని, మరికొందరికి ఆర్డర్ తీసుకుని కంటి అద్దాలు అందజేస్తున్నట్లు వివరించారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపిస్తే సహించం



పార్కు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డి డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో ప్రారంభించిన అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపిస్తే సహించేది లేదని కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి హెచ్చరించారు. మంగళవారం ఆయన సర్కిల్ డీఈ దామోదర్‌రెడ్డితో కలసి కిష్కింద పార్కులో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా లచ్చిరెడ్డి మాట్లాడుతూ... డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీల విస్తరణ పనులు చివరి దశలో ఉన్నాయన్నారు. సర్కిల్ ఏఈ రాకేష్, కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులు పురుషోత్తంరెడ్డి, రాజిరెడ్డి, ధన్‌రాజ్, స్థానిక నాయకుడు పవన్‌రెడ్డి పాల్గొన్నారు.

స్థానిక ఉత్పత్తులకు ప్రోత్సాహించాలి



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

హస్తినాపురం: స్థానిక ఉత్పత్తులకు ప్రాధాన్యమిచ్చి ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని జైళ్ల శాఖ రిటైర్డ్ ఐజీ సైదులు అన్నారు. హస్తినాపురం గాయత్రీనగర్ చౌరస్తాలోని స్థానిక ఉత్పత్తుల కేంద్రం (ఎల్‌పీడీవో) ప్రతినిధి భరత్‌సంఘం ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన సైదులు మాట్లాడుతూ... నగరంలో స్థానిక ఉత్పత్తుల కేంద్రం విస్తరించేలా కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా ఎల్‌పీడీవో ఆధ్వర్యంలో ముద్రించిన కేలండర్‌ను ఆవిష్కరించారు. ప్రతినిధులు నేతలు ప్రభాకర్‌రావు, కాంతారావు, రవిప్రకాష్ యాదవ్, గోపాలకృష్ణ పాల్గొన్నారు.

ఇష్టారాజ్యంగా బెల్టుషాపులు

- మద్యం మత్తులో చిత్తవుతున్న యువత భవిత
- మత్తులో పెరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలు
- ప్రజలు ఫిర్యాదులు చేస్తున్నా స్పందన నిల్
- అధికారులు, పాలకుల తీరుపై నిరసన వెల్లువ

కాలనీలు, బస్తీల్లో ఇష్టారాజ్యంగా బెల్టుషాపులు వెలుస్తున్నాయి. దీంతో మద్యానికి బానిసవుతున్న యువత తమ బంగారు భవిష్యత్‌ను బుగ్గిపాలు చేసుకుంటోంది. సరదా కోసం ప్రారంభమైన తాగుడు చివరకు వ్యసనంగా మారి పేద కుటుంబాలను రోడ్డున పడేలా చేస్తోంది.



దిల్‌సుఖ్‌నగర్: మలక్‌పేట్ నియోజకవర్గం పరిధిలోని పలు ప్రాంతాల్లో మద్యం బెల్టు షాపులు ఇష్టారాజ్యంగా వెలిశాయి. కాలనీలు, బస్తీలనే తేడా లేకుండా బెల్టు షాపులను ఏర్పాటు చేసుకొని పేదలను ముఖ్యంగా యువతను మద్యానికి బానిసలుగా మారుస్తున్నారు. తద్వారా యువత భవిష్యత్ మద్యం మత్తులో చిత్తవుతోందనే ఆందోళనకు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి. నియోజకవర్గానికి సరిహద్దులో ఉన్న మహేశ్వరం, యాఖత్‌పురా తదితర నియోజకవర్గాల పరిధిలోని పలు ప్రాంతాల్లోనూ బెల్టుషాపులు పెద్ద ఎత్తున ఉన్నాయి.

- సింగరేణికాలనీ, ఎన్‌టీఆర్ నగర్, భగత్‌సింగ్ నగర్, శంకర్‌నగర్, శంకేశ్వరబజార్, అంబేడ్కర్‌నగర్ ఇలా ఏ కాలనీలో చూసినా మద్యం బెల్టు షాపులు ఉన్నాయి. ఎప్పుడు కావాలంటే అప్పుడు మద్యాన్ని విక్రయిస్తున్నారు. ప్రధానంగా యువత, పేదలు మద్యానికి బానిసలుగా మారి రోడ్లపై నిషాలో కొట్టుమిట్టాడుతున్నారు.
- మలక్‌పేట్, చాదర్‌ఘాట్, ఐఎస్‌సదన్, కుర్మగూడ, ఆర్‌కేపురం, సరూర్‌నగర్ తదితర ప్రాంతాలలోని బస్తీలు, కాలనీల్లో ఏ చౌరస్తాలో చూసినా మద్యం దుకాణాలు, మరికొన్ని చోట్ల యథేచ్ఛగా విక్రయాలు జోరుగా జరుగుతున్నాయి. కూలి పనులకు వెళ్లే పేదలు, చిరుద్యోగులు తమ విధులకు వెళ్లాలనే సంగతినే మరిచి ఎక్కడంటే అక్కడే నిషాలో జోగుతున్నారు.
- అప్పుచేసైనా సరే మందు తాగేందుకు మొగ్గుచూపుతున్నారు. దీంతో మద్యం మత్తులో అసాంఘిక కార్యక్రమాలు తరచు చోటు చేసుకుంటున్నాయి.
- కాసులకు కక్కుర్తిపడిన ప్రభుత్వం మద్యం ప్రియులను ప్రోత్సహించడంతో వయో, లింగ భేదం లేకుండా అన్ని వర్గాల వారు మద్యం మత్తులో తూలుతున్నారు. చీప్ లిక్కర్, గుడుంబా పంజాతో మురికివాడల్లోని పేదల కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నాయి.

నిబంధనలకు నీళ్లొదిలిన మద్యం దుకాణాలు

- మద్యం అమ్మకాల టార్గెట్ పెంచేందుకు సంబంధిత శాఖల అధికారులు తమ వంతు చేయూతనిస్తుండటంతో మద్యం దుకాణాలు నిబంధనలను పాటించడం లేదనే ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో మురికివాడలు, పలు కాలనీలలో బెల్టుషాపులు పెరిగిపోతున్నాయి.
- బెల్టుషాపులతో శాంతి భద్రతల ఉనికి ప్రశ్నార్థకంగా మారుతోంది. పేదల కుటుంబాలు వీధిన పడుతున్నాయి. మరికొందరు వేళాపాళా లేకుండా తాగిన మత్తులో రద్దీ రహదారులపై కూడా నిద్రించడం, వీరంగాన్ని సృష్టిస్తున్నారు. దీంతో ఎప్పుడు ప్రమాదం సంభవిస్తుందో తెలియని పరిస్థితులు నెలకొన్నాయి.
- విజయవాడ ప్రధాన రహదారులు, శ్రీశైలం, నాగార్జునసాగర్ రహదారులపై మందుబాబుల చిందులు ప్రమాదాలకు దారితీస్తున్నాయి.
- బెల్టుషాపులలో మద్యం అమ్మేవారిపై ఉక్కుపాదం మోపాలని, ప్రభుత్వం, అధికారులు మద్యం అమ్మకాల విషయంలో కచ్చితంగా నిబంధనలను పాటించే చూడాలని, యువతకు మద్యం నుంచి వచ్చే అనర్థాలపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఎక్సైజ్ అధికారులు నిబంధనలు పాటించని మద్యం దుకాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని, కాలనీల్లోని బెల్టుషాపులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేస్తున్నారు.

వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న పురోహితులు, పాల్గొన్న కమిటీ చైర్మన్, సభ్యులు

మలక్‌పేట: మూసారంబాగ్ ఎస్‌బీఐ ఆఫీసర్స్ కాలనీ శ్రీకంచికామకోటి పీఠం, శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానం 24వ బ్రహ్మోత్సవాలు, శివపార్వతీ అమ్మవారి ఆలయ 15వ బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా మంగళవారం హనుమంతునికి పంచామృతాభిషేకం ఉండ్రాళ్లతో లక్ష్మీగణపతి హోమం చేశారు. శ్రీవారి కల్యాణోత్సం, శివపార్వతి అమ్మవార్ల శాంతి కల్యాణాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. గరుడ వాహనంపై శ్రీవారి అమ్మవార్ల గ్రామోత్సవ సేవ, మూసారంబాగ్ శ్రీనివాస మహిళా భక్తమండలి వారిచే విష్ణు సహస్రనామ పారాయణ, లక్ష్మీపొండరీక మహాశాంతి యజ్ఞం, భక్తులకు అన్నసంతర్పణ (ప్రసాద వితరణ) చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ ఉన్నవ పూర్ణచందర్‌రావు, శారద దంపతులు, వీవీఎన్ హరీష్, వైస్ చైర్మన్ విశ్వేశ్వర్‌రావు, కార్యదర్శి కుమార్ పురోహిత్, కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు. ప్రధాన అర్చకులు జ్వాల నర్సింహాచార్యులు, టీటీడీ నుంచి విచ్చేసిన వేదపండితుల పర్యవేక్షణలో బ్రహ్మోత్సవాలు నిర్వహించినట్లు పూర్ణచందర్‌రావు తెలిపారు. మూసారంబాగ్ పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

కాలనీల్లో పరిశుభ్రత పాటించాలి



చిత్రలేవుట్ కాలనీవాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ రాధా ధీరజ్‌రెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: కాలనీలో చెత్తాచెదారం లేకుండా పరిశుభ్రంగా ఉంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆర్‌కేపురం డివిజన్ కార్పొరేటర్ రాధా ధీరజ్‌రెడ్డి జీహెచ్‌ఎంసీ అధికారులకు సూచించారు. మంగళవారం ఆర్‌కేపురం డివిజన్ చిత్రలేవుట్ కాలనీలో సీనియర్ సిటిజన్ కార్యాలయం ఎదుట పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని కాలనీ వాసులతో కలసి శుభ్రం చేశారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ... కాలనీలో చెత్త లేకుండా చూడాలని జీహెచ్‌ఎంసీ శానిటేషన్ సిబ్బంది సూచించారు. భారతీయ జనతా మహిళా మోర్చా అధ్యక్షురాలు కుసుమ, బీజేపీ నాయకుడు, కాలనీ అధ్యక్షుడు ముస్కు అంజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, ఉదయ్, రామకృష్ణ, శ్రీలక్ష్మి, నర్మద పాల్గొన్నారు.

ట్రంక్‌లైన్‌తో మురుగు సమస్యకు చెక్



నాలా నిర్మించే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ మధుసూదన్‌రెడ్డి

చంపాపేట: కర్మన్‌ఘాట్ ప్రాంతంలోని గాయత్రీనగర్ చౌరస్తా నుంచి కర్మన్‌ఘాట్ చౌరస్తా వరకు భూగర్భ డ్రైనేజీ ట్రంక్‌లైన్ ఏర్పాటు చేయటం వల్ల మురుగు పరుగు సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని చంపాపేట కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన లక్ష్మీపురం, కర్మన్‌ఘాట్ ఓల్డ్ విలేజీలో పాదయాత్ర నిర్వహించారు. అనంతరం మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ... త్వరలో ట్రంక్‌లైన్ ఏర్పాటు చేయటం వల్ల మైత్రీపురం, జ్యోతినగర్, క్రాంతినగర్, కర్మన్‌ఘాట్, పద్మానగర్, సామసరస్వతీనగర్ కాలనీల వరద ముంపు సమస్యకు పరిష్కారం లభిస్తుందన్నారు. నాయకులు దశరథ్‌గౌడ్, సద్ది సందీప్‌రెడ్డి, గూడూరు అవినాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సంరక్షణపై అవగాహన



నాగోలు: ఆర్యోగ్యాన్ని సంరక్షించే విషయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉంటూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని క్రైరా ఫౌండేషన్ చైర్మన్ ఎం.లక్ష్మీజగదీశ్వరి అన్నారు. మంగళవారం కొత్తపేటలో క్రైరా ఫౌండేషన్, తపాడియా డయగ్నోస్టిక్ సెంటర్ సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. షుగర్, బీపీ పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్య సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని సూచించారు.

ప్రజలకు అందుబాటులో ఉంటున్నా

మన్సూరాబాద్: డివిజన్‌లో అభివృద్ధి పనులు చేపడుతూ డివిజన్ వాసులకు ఎల్లవేళలా అందుబాటు ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి స్పష్టంచేశారు. హయత్‌నగర్ డివిజన్ పరిధి బొమ్మలగుడి నుంచి శివం హిల్స్ కాలనీకి వెళ్లే ప్రధాన రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించే పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ... రెండు నెలల క్రితమే రూ. 2.20 లక్షలు మంజూరయ్యాయని, ఈ నిధులు సరిపోవని అధికారులపై ఒత్తిడి తెచ్చి మరో రూ. 50 వేలు నిధులు మంజూరు చేయించి ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగిస్తున్నట్లు వెల్లడించారు. రోడ్డుపై ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలను వెనక్కి జరుపుతున్నట్లు పేర్కొన్నారు.



శివంహిల్స్ కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

ద్విచక్ర వాహనాలు ఢీ: బీటెక్ విద్యార్థి మృతి



మృతుడు గౌరవ్ కుమార్ ఐడీ కార్డ్

నాగోలు: రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొన్న సంఘటనలో కిందపడిన బీటెక్ విద్యార్థి గుండెపోటుతో మృతి చెందాడు. వివరాలివీ... కొత్తపేటలోని విజయ్‌పురికాలనీ రోడ్డు నెంబర్-3లో నివాసం ఉండే రామ్‌గిర్వార్ అనిల్‌కుమార్-కల్పన భార్యాభర్తలు. వీరికి ఇద్దరు కుమారులు. చిన్న కుమారుడు భార్గవ్ స్థానికంగా ఓ ప్రైవేట్ పాఠశాలలో చదువుకుంటున్నాడు. పెద్ద కుమారుడు గౌరవ్ కుమార్(17) నాగోలు బండ్లగూడ ప్రాంతంలోని శ్రేయాస్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ సీఎస్‌సీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. రోజూ తన ద్విచక్ర వాహనంపై కళాశాలకు వెళ్తాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం ఇంటి నుంచి 8:30 గంటలకు తన ద్విచక్ర వాహనంపై అల్కాపురి చౌరస్తా నుంచి నాగోలు ఫ్లైఓవర్ కింద నుంచి వెళ్తున్నాడు. ఎల్‌బీనగర్ నుంచి ఉప్పల్ వైపు ద్విచక్ర వాహనం పై ముగ్గురు వెళ్తున్నారు. నాగోలు ఆంధ్రా బ్యాంక్ వద్ద యూటర్న్ తీసుకునే క్రమంలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో కింద పడిన గౌరవ్ కుమార్‌కు ముఖంపై స్వల్పగాయమైంది. దీంతో అతను అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. వెంటనే అక్కడున్న వారు అతన్ని చికిత్స నిమిత్తం నాగోలు చౌరస్తాలోని సుప్రజా హాస్పిటల్‌కు తరలించారు. వైద్యులు గౌవర్‌కుమార్‌ను పరిశీలించి అప్పటికే గౌరవ్‌కుమార్ కార్డియాక్ అరెస్ట్ (గుండెపోటు)తో మృతి చెందినట్లు స్పష్టం చేశారు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు, స్నేహితులు సుప్రజా హాస్పిటల్‌కు వద్ద చేరుకుని కన్నీరు మున్నీరుగా విలపించారు. అనంతరం మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లి వీవీనగర్ శ్మశానవాటికలో మంగళవారం సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు.

తప్పుడు ప్రచారంతో మభ్యపెడుతున్న పాలకులు: కాంగ్రెస్

- కొత్తపేట టిమ్స్ స్థలాన్ని సందర్శించిన కాంగ్రెస్ నాయకులు
- పోలీసులు అడ్డుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తం
- తోసుకొని లోనికి వెళ్లిన కాంగ్రెస్ నేతలు
- మొక్కలు నాటి, క్రికెట్ ఆడి నిరసన



కొత్తపేట టిమ్స్ స్థలంలో పర్యటిస్తున్న కాంగ్రెస్ నేతలు

చైతన్యపురి: నిమ్స్ తరహాలో నగరానికి నలువైపులా టిమ్స్ ఆస్పత్రుల నిర్మాణాలు జరుగుతున్నాయని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీష్‌రావు తప్పుడు ప్రచారాలు చేస్తూ ప్రజలను మభ్యపెడుతున్నారని ఏఐసీసీ ఇంప్లిమెంటేషన్ కమిటీ చైర్మన్, టీ పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్‌కుమార్ యాదవ్ విమర్శించారు. కొత్తపేటలోని టిమ్స్ ఆస్పత్రిని నిర్మించాలనుకున్న స్థలాన్ని కాంగ్రెస్ నేతలు మంగళవారం సందర్శించారు. మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిని నిర్మించాలని తలపెట్టిన స్థలంలోకి కాంగ్రెస్ నాయకులను రానివ్వకుండా చైతన్యపురి పోలీసులు అడ్డుకున్నారు. దీంతో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితులు చోటుచేసుకున్నాయి. బారికేడ్లు తోసుకుని టిమ్స్ నిర్మాణ శంకుస్థాపన ప్రాంతానికి చేరుకున్న కాంగ్రెస్ నాయకులు అక్కడ మొక్కలు నాటి నిరసన తెలిపారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ... మంత్రి ప్రకటన చూసి ఎన్ని ఫ్లోర్‌లు టిమ్స్ నిర్మాణం జరిగిందో చూసి వాస్తవాలు తెలుసుకునేందుకు కాంగ్రెస్ బృందం వచ్చిందని, నిర్మాణం కాదు.. పునాదులు కూడా తీయని విషయాన్ని గమనించామన్నారు. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను మరిచి బూటకపు, అబద్ధపు మాటలతో మభ్యపెడుతోందని స్పష్టం అవుతోందన్నారు. శంకుస్థాపన చేసి 10 నెలలు కావస్తున్నా ఇంతవరకు నిర్మాణం మొదలు పెట్టలేకపోయారని ఆరోపించారు. రూ. 1200 కోట్లు ఖర్చుపెట్టి సెక్రటేరియట్ నిర్మాణం, జిల్లాకు ఒక బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయం, నియోజకవర్గాల్లో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాలు, ప్రగతి భవన్ నిర్మించుకుంటున్నారని విమర్శించారు. కొత్తపేటలో ఉన్న పండ్ల మార్కెట్‌ను నిర్వీర్యం చేసి రైతులు, వ్యాపారులను రోడ్డు పాలు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరోగ్య శాఖలో 11 వేల పోస్టులు ఖాళీగా ఉన్నాయని కాగ్ నివేదిక పేర్కొందని, ఆస్పత్రులలో సిబ్బందిని నియమించకుండా మెరుగైన వైద్య సేవలు ఎలా అందిస్తారని ప్రశ్నించారు. ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధ ఉన్నా బడ్జెట్‌లో వైద్య, ఆరోగ్య శాఖకు 8 శాతం నిధులు మంజూరు చేయాలని, శంకుస్థాపన చేసిన ఆస్పత్రుల నిర్మాణాలను పూర్తి చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి నిరంజన్, రంగారెడ్డి జిల్లా పార్టీ అధ్యక్షుడు చల్ల నర్సింహారెడ్డి, ఎల్‌బీనగర్ ఇంచార్జి మల్‌రెడ్డి రాంరెడ్డి, జీహెచ్‌ఎంసీ ఫ్లోర్ లీడర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, నాయకులు జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, రోహిన్‌రెడ్డి, చిలుక మధుసూదన్‌రెడ్డి, గజ్జి భాస్కర్ యాదవ్, లింగాల కిషోర్, మల్లారపు శ్రీనివాస్, శశిధర్‌రెడ్డి, గుర్రం శ్రీనివాసరెడ్డి, సురేందర్‌రెడ్డి, రమేష్, శ్యాంచరణ్‌రెడ్డి, సుజాతరెడ్డి, స్వర్ణమాధవి, రజనీరావు, సౌమ్య, నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.



క్రికెట్ ఆడుతున్న దృశ్యం

11న మెగా జాబ్‌మేళా: సద్వినియోగం చేసుకోవాలి

- ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి
- ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే



సరూర్‌నగర్ స్టేడియంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తదితరులు

నాగోలు: సరూర్‌నగర్‌లోని స్టేడియంలో ఫిబ్రవరి 11న జరిగే మెగా జాబ్ మేళా ఏర్పాట్లను ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... స్టేడియం వెనుక ఉన్న స్థలంలో జాబ్ మేళా నిర్వహిస్తారన్నారు. జాబ్ మేళాకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. తెలంగాణ రాష్ట్రంలోనే ఇది అతిపెద్ద జాబ్ మేళా అని తెలిపారు. దాదాపు 108 కంపెనీలు (టెక్నికల్, నాన్ టెక్నికల్, ఐటీ, నాన్ ఐటీ) కంపెనీలు ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. దాదాపు 10,000 మంది నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు. ఏడవ తరగతి నుంచి పీజీ పాస్ అయిన వారందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జాబ్ మేళా ఉంటుందన్నారు. కార్యక్రమంలో డీవైఎస్‌ఓ వెంకటేశ్వర్లు, సెట్విన్ ఎండీ వేణుగోపాల్‌రావు, మన్మోహన్, అనంతుల రాజిరెడ్డి, రామకాంత్, రామ్‌కళ్యాణ్, చంద్రశేఖర్‌రెడ్డి, తిలక్, సుమంత్ తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణకారుల అభ్యున్నతికి కృషి



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తదితరులు

చైతన్యపురి: దిల్‌సుఖ్‌నగర్ విశ్వబ్రాహ్మణ స్వర్ణకార సంఘం రూపొందించిన నూతన సంవత్సర కేలండర్‌ను ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఆవిష్కరించారు. క్యాంప్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ... స్వర్ణకారుల అభ్యున్నతికి సీఎం కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు. వారికి అన్ని విధాలా అండగా ఉంటూ వారి అభ్యున్నతికి సహకరిస్తుందన్నారు. సంఘం అధ్యక్షుడు శ్రీరామదాసు రవిచారి, గౌరవ అధ్యక్షుడు ఎర్రోజు వేణుగోపాల్ చారి, సెక్రటరీ తుడిమల్ల లవకుమార్, కోశాధికారి రాగిపని వెంకటరమణ, ఉపాధ్యక్షులు వెంకటాచారి, సహాయ కార్యదర్శి శ్రీనివాస్‌చారి, సలహాదారులు బ్రహ్మం, మాజీ అధ్యక్షుడు కీర్తిగారి అనంతాచారి, కొండోజు వేణుగోపాల్‌చారి, శ్రీనివాసచారి, నరసింహచారి తదితరులు పాల్గొన్నారు.

ప్రవాస భారతీయుడి ఇంట విషాదం



మృతి చెందిన శ్రీశాంత్‌రెడ్డి (ఫైల్)

హయత్‌నగర్: దేశ సంస్కృతి, సంప్రదాయాలపై ఉన్న మక్కువతో ఆ దంపతులు వాటిని తమ పిల్లలకు కూడా అలవర్చాలనుకున్నారు. విదేశాలలో స్థిరపడినా దేశం గొప్పదనాన్ని తెలియ జేయాలనుకుని తమ పిల్లలను ఇక్కడ చదివించాలని న్యూజిలాండ్ నుంచి నగరానికి వచ్చారు. కానీ ఒక యాక్సిడెంట్ వారి ఆశలను అడియాసలు చేసింది. తమ కోరికను తీర్చుతాడని తలంచిన కొడుకు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆ ప్రవాస భారతీయుని ఇంట్లో విషాదం నెలకొంది. వివరాలివీ... జగిత్యాల జిల్లా మల్యాల మండలం మ్యాడంపల్లికి చెందిన ముదిగంటి సురేందర్‌రెడ్డి, స్వర్ణలక్ష్మిలు 20 ఏళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. ఇద్దరూ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు కావడంతో ఆస్ట్రేలియాలో ఉద్యోగం పొందారు అనంతరం న్యూజిలాండ్‌కు వెళ్లి అక్కడే స్థిరనివాసం ఏర్పరచుకున్నారు. అక్కడే వారికి కూతురు శ్రీజ, కొడుకు సాయిశ్రీశాంత్‌రెడ్డి(13)లు జన్మించారు. వారికి ఆదేశం సౌరసత్వం కూడా లభించింది. కొంత కాలం పిల్లలను అక్కడే చదివించిన వారు దేశ సంస్కృతి, సంప్రదాయాలను పిల్లలకు కూడా తెలియజేయాలనే సంకల్పంతో ఆరేళ్ల క్రితం నగరానికి వచ్చి బండ్లగూడ సమీపంలోని ఇంద్రప్రస్థ కాలనీలో ఉంటున్నారు. శ్రీజ ఇంటర్మీడియట్ చదువుతుండగా సాయి శ్రీశాంత్‌రెడ్డిని సాగర్ రింగ్‌రోడ్డు సమీపంలోని అక్షర పాఠశాలలో చేర్పించారు. శ్రీశాంత్‌రెడ్డి 8వ తరగతి చదువుతున్నాడు. పిల్లల చదువు కోసం భార్యాభర్తలు ఆరునెలలకు ఒకరు ఇక్కడ, ఒకరు న్యూజిలాండ్‌లో ఉంటున్నారు.

సరదాగా సైకిల్‌పై వెళ్లి...

- ఆదివారం సాయంత్రం స్నేహితులతో కలిసి సరదాగా సైకిల్ తొక్కేందుకు శ్రీశాంత్‌రెడ్డి ఇందూ అరణ్య సమీపంలోని కొత్తగా నిర్మించిన రోడ్డుపై వెళ్తున్నాడు. అదే రోడ్డుపై వేగంగా జావా బైకును నడుపుకుంటూ వస్తూ శ్రీశాంత్‌రెడ్డి సైకిల్‌ను ఢీకొట్టారు. దీంతో అతని తలకు తీవ్ర గాయం అయ్యింది. స్థానికుల సమాచారంతో శ్రీశాంత్‌రెడ్డి తండ్రి వచ్చి తన కారులో అతన్ని తీసుకెళ్లి చికిత్స నిమిత్తం కామినేని ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ శ్రీశాంత్‌రెడ్డి సోమవారం మృతి చెందాడు. బాలుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నిందితులూ మైనర్లే...

- శ్రీశాంత్‌రెడ్డి సైకిల్‌ను ఢీ కొట్టిన బైకును నడుపుతున్న వారు మైనర్‌లు అని పోలీసులు తెలిపారు. నిందితులు సెల్‌ఫోన్‌లో వీడియో తీస్తూ బైకును నడుపుకుంటూ అజాగ్రత్తగా వెళ్లి సైకిల్‌ను ఢీ కొట్టినట్లు పోలీసులు తెలిపారు. వారు కూడా గాయపడటంతో చికిత్స నిమిత్త ఆస్పత్రిలో చేర్పించినట్లు వారు పేర్కొన్నారు.

తల్లి కోసం ఎదురు చూపు...

- మృతుని తల్లి స్వర్ణలక్ష్మి న్యూజిలాండ్‌లో ఉండటంతో బాలుడి అంత్యక్రియలు నిర్వహించలేదు. బాలుడి మృత దేహాన్ని కామినేని ఆస్పత్రి మార్చురీలో ఉంచి తల్లి రాకకోసం ఎదురు చూస్తున్నారు. ఆమె మంగళవారం రాత్రి ఇక్కడికి చేరుకుంటుందని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ఏడాది పిల్లలను హాస్టల్ చేర్పించి తాము ఇద్దరు న్యూజిలాండ్‌లో ఉందామని తలంచిన సమయంలో ఈ సంఘటన జరిగింది. పిల్లల చదువు కోసం విదేశాల నుంచి వచ్చిన ఆ కుటుంబం ఆశలు ఒక్క ప్రమాదంతో గల్లంతయ్యాయి. బాలుడి మృతితో ఇంద్రప్రస్థ కాలనీలో విషాద ఛాయలు అలుముకున్నాయి.